క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో జి.వి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకుడు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం: చావులమదుం జంక్షన్‌లో గల కులాసా బార్ అండ్ రెస్టారెంట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్.ఐ. సింహాచలం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు బుధవారం ఉదయం అక్కడికి చేరుకుని మృతుని వివరాలు సేకరించేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. అయితే స్థానికులు అతను ఎవరో చెప్పలేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సుమారు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, గ్రే, బ్లాక్ జుట్టు కలిగి, వైట్ షర్ట్ పై గ్రే కలర్ టీషర్టు ధరించి ఉన్నాడని, బ్రౌన్ కలర్‌పై చెక్స్ చుక్కల షార్టు వేసుకుని ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 0891–2783672, 8500424192 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

మార్కెట్‌ను ముంచెత్తిన మామిడి కాయలు



అమ్మకానికి సిద్ధమైన మామిడి కాయలు

జగదాంబ: గతంలో కాలాన్ని బట్టి పంటలు పండేవి. ఇప్పుడు కాలం మారిపోయింది. ఎండా కాలంలోనే కనిపించే మామిడి కాయలు అప్పుడే మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. పూర్ణా మార్కెట్‌లో పచ్చి మామిడి కాయల విక్రయాలు అప్పుడే మొదలైపోయాయి. ఈ కాయలు చిత్తూరు నుంచి దిగుమతి అవుతున్నాయని.. ఒక్కొక్కటి రూ. 50 అని వ్యాపారులు తెలిపారు.

ఘనంగా లక్ష్మీ పూజ



లక్ష్మీ పూజ నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ రెజికుమార్

సీతమ్మధార: డాక్టర్ పైలా ఆదిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గణేష్‌నగర్‌లోని శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన ఆలయంలో లక్ష్మీపూజ, దీపారాధన ఘనంగా జరిగాయి. శబరిమల మాలికాపుర మాత ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఎం.ఎన్. రెజికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 మంది మహిళలు విచ్చేయగా త్రిముఖ విఘ్నేశ్వర ఆలయం నుండి అయ్యప్ప పూజా స్థలానికి చేరుకున్నారు. ఆలయ చైర్మన్ టి.ఎస్.ఎన్. మూర్తి, జి. కృష్ణ, ఎం.ఎస్. ప్రకాశరావు, టి. వెంకటరావు, ఎం. రంగారావు, పైలా రమణ తదితరులు పాల్గొన్నారు.

బతుకుపోరులో.. నిత్య శ్రామికులు

వాళ్లంతా చిరు సంపాదనపరులు. పొద్దు పొడవక ముందే పనిలో పడతారు. పడమట సూర్యుడు అస్తమించే వరకు అలుపు సొలుపు లేకుండా కష్టపడతారు. టీ విక్రయిస్తూ.. రోడ్డుపై కనిపించే ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ.. కార్మికులకు తినుబండారాలు అమ్ముతూ ఉపాధి పొందుతున్నారు. కుటుంబ పోషణకు శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నారు.



- ఒకరు టీ విక్రయిస్తూ..
- మరొకరు ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ..
- ఇంకొకరు చిరువ్యాపారం చేస్తూ..
- అలసిపోని జీవన పయనం సాగిస్తున్న అభాగ్యులు

డాబాగార్డెన్స్: జీవితం కొందరికి పాఠం నేర్పుతుంది. మరి కొందరికి దిక్సూచిగా నిలుస్తుంది. ఇంకొందరికి ఉపాధి కల్పిస్తుంది. జీవితం నేర్పే పాఠానికి పెద్ద చదువులు ఉండనక్కర్లేదు. పెద్దగా ఆస్తులు.. అంతస్తులు అవసరం లేదు. కష్టపడితే తగ్గ ప్రతిఫలమే వేరు. ఆ ప్రతిఫలంలోనే ఆనందం.. ఆత్మ సంతృప్తి దాగి ఉన్నాయి. అందుకు నిదర్శనం.. ఈ చిరు సంపాదనపరులే. జీవీఎంసీ పరిధిలో ఎందరో ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పొట్ట కూటి కోసం.. కుటుంబ పోషణ కోసం వారికి నచ్చిన పనుల్లో జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు.

టీ విక్రయిస్తూ..

విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ పరిధి (పోర్టు పరిసర ప్రాంతమంతా.. అన్ని విభాగాలు)లో సుమారు 40 ఏళ్లగా 45 మంది చాయ్ విక్రయించేవారు ఉన్నారు. వీరంతా వేకువ జాము 4 గంటలకే పోర్టుకి చేరుకుంటారు. 10 గంటల వరకు 6 నుంచి 10 ఫ్లాస్కుల ద్వారా టీ విక్రయిస్తుంటారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు చాయ్ అమ్ముతుంటారు. వీరంతా పోర్టులోని సీపోర్టు, ఎస్సార్ పాయింట్, బొగ్గు జెట్టీ, ఎల్–15 బెర్త్, శ్రీనివాస కాటా, నార్త్ గేట్, ప్రధాన గేట్, ఎస్–4, కాన్వెంట్ ఏరియా.. ఇలా పోర్టు పరిధిలో ఉన్న అన్ని విభాగాలలో టీ విక్రయిస్తుంటారు.



పోర్టులో టీ విక్రయించే వెంకట్రావు

ప్లాస్టిక్ నియంత్రణలో భాగస్వామిగా..

జీవీఎంసీ దక్షిణ నియోజకవర్గమే కాక తూర్పు.. ఉత్తర నియోజకవర్గాల్లోని కొన్ని వార్డుల నుంచి గెడ్డలు.. కాల్వల ద్వారా కాన్వెంట్ జంక్షన్ వద్ద విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌కు వెళ్లే దారిలో గల గెడ్డకు చెత్తా.. చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు.. మురుగు నీరు చేరుతుంది. ఇక్కడ టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోతుంటాయి. బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకుని జీవనం సాగిస్తున్న ఓ అభాగ్యుడు తనకు అనారోగ్యం సోకుతుందని తెలిసినప్పటికీ పొట్ట కూటి కోసం ఏదో ఒకటి చెయ్యాలి కనుక పీకల్లోతు మురుగులో దిగి ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ బతుకుతున్నాడు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలోకి వెళ్లకుండా.. పర్యావరణ పరిరక్షణలో భాగస్వామిగా నిలుస్తున్నాడు.

చిరు వ్యాపారం సాగిస్తూ..

అతనో పెద్దాయన. వయస్సు 60 ఏళ్లు పైబడింది. పిల్లలపై ఆధారపడలేదు. మొక్కజొన్నలు విక్రయిస్తూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. ఉదయం నుంచి పొద్దు పోయే వరకు వాటిని విక్రయిస్తూ కుటుంబం కోసం తను సంపాదించుకోవడమే కాక.. పిల్లలు.. మనుమరాండ్రకు సాయమందిస్తున్నాడు.



జంతికలు విక్రయించే పెద్దాయన

సేవలందిస్తూ..

సాధారణంగా ఇంట్లో గాని.. ఇంటి ముందర గాని చెత్త చేరితే ఉండలేం. అమ్మో దోమలు వచ్చేస్తున్నాయి. ఈగలు వాలుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోందంటూ గంతులేస్తాం. అలాంటిది వేకువ జాము 5 గంటల నుంచి నగర ప్రజల ఆరోగ్యం కోసం తన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా సేవలందిస్తున్నాడు అతను. చెత్త కాల్వల్లో వేయకండని అవగాహన కల్పిస్తున్నప్పటికీ అవగాహన లేని వారు.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారి వల్ల జీవీఎంసీ పరిధిలో ఎక్కడికక్కడ కాల్వల్లో చెత్తలు వేయడంతో అవి నిండి మురుగు నిలిచిపోతోంది. మోకాలి లోతు మురుగు కాల్వలో దిగి ఎటువంటి భద్రతా సామగ్రి లేకుండా తన చేత్తోనే చెత్త తీస్తూ.. ప్రజలకు సేవలందిస్తూ.. కుటుంబ పోషణలో భాగస్వామి అయ్యాడు.



పేద మహిళకు వాసుపల్లి చేయూత

వైద్య సహాయం కోసం రూ.5 వేల ఆర్థిక సాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి రాములవారి వీధికి చెందిన గాలి మణి సాయం కోసం బుధవారం వాసుపల్లిని కలిశారు. ఇంటి పనులు చేసుకుంటూ అనారోగ్యంతో ఉన్న తమ్ముడితో కలిసి ఉంటున్నానని, అద్దె కూడా చెల్లించుకోలేని స్థితిలో ఉన్నామని వాసుపల్లి వద్ద ఆమె మొర పెట్టుకుంది. తమ్ముడు గోవిందు పక్షవాతంతో మంచాన పడ్డాడని, వైద్యం చేసుకునే స్తోమత లేదని ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన వాసుపల్లి గణేష్‌కుమార్ తక్షణమే తన సొంత నిధుల నుంచి రూ.5 వేలు అందజేసి వైద్యానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో అసలు ఎమ్మెల్యే ఉన్నారా? అనే సందేహం కలుగుతుందన్నారు. సమస్యల పట్ల గానీ, పేదలను ఆదుకోవడంలో గానీ ఇక్కడి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రజలకు కనిపించడం లేదని నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు చేదోడుగా నిలిచాయన్నారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రభుత్వ పథకాలు అందజేయడంతో పాటు సొంత నిధులతో ప్రజల వద్దకు వెళ్లి సేవలు చేశామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాసుపల్లి సహకారం పట్ల బాధితురాలు గాలి మణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమ్మాజీ, సనపల రవీంద్ర భరత్, ముజీబ్‌ఖాన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

చురుగ్గా ఎన్‌సీడీ సర్వే



కుమ్మరవీధిలో సర్వే చేస్తున్న ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, ఆశ వర్కర్ పార్వతి

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు పరిధి కుమ్మరివీధి సచివాలయం ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులపై బుధవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సర్వేలో ఇన్‌ఫెక్షన్ల వల్ల సంభవించే దీర్ఘకాలిక అనారోగ్యాలపై ఆరా తీస్తున్నారు. గుండెపోటు, హృదయ సంబంధ వ్యాధులు, క్యాన్సర్లు, క్రానిక్ అబ్స్ట్రాక్టివ్ పల్మనరీ డిసీజ్, ఆస్తమా వంటి శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం, మానసిక ఆరోగ్య పరిస్థితులపై అవగాహన నిమిత్తం ఈ సర్వే చేపడుతున్నట్లు ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి తెలిపారు. ఆహారపు అలవాట్లలో భాగంగా నూనె వాడకం వంటి వాటిపై పూర్తిస్థాయి సర్వే చేపడుతున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఆశ వర్కర్ పార్వతి పాల్గొన్నారు.

7 నుంచి గీతా జయంతి వేడుకలు

పాల్గొననున్న చినజీయర్‌స్వామి

సీతమ్మధార: ప్రముఖ ఆధ్యాత్మిక ఆచార్యులు త్రిదండి చినజీయర్‌స్వామి ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకూ విశాఖలో నిర్వహించే గీతా జయంతి వేడుకల్లో పాల్గొంటారని వారిజ ఆశ్రమ కమిటీ, వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రతినిధులు తెలిపారు. సీతమ్మధారలో గల వర్మ కాంప్లెక్స్ (పాత ఈనాడు ప్రాంగణం)లో ఈ వేడుకలు జరగనున్నాయని బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ఎస్ఆర్ వర్మ మాట్లాడుతూ ప్రజలంతా సుఖంగా జీవించాలని ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా డిసెంబర్ 8 ఉదయం 10 గంటల నుంచి శ్రీరామ పాదుకా ఆరాధన, సాయంత్రం నేత్ర విద్యాలయ విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. వారిజ వేద పాఠశాల ఆచార్యులు ముడుంబై శ్రీకాంత్ మాట్లాడుతూ దాదాపు 7 సంవత్సరాల తర్వాత చిన్న జీయర్ స్వామి విశాఖకు వస్తున్నారని అన్నారు. భీమిలి బీచ్ రోడ్డులోని మంగమారిపేటలో గల వారిజ ఆశ్రమంలో ఒక పక్క వేద పాఠశాల, అదే ప్రాంగణంలో దివ్య నేత్రులకు (అంధ విద్యార్థులకు) నేత్ర విద్యాలయ పాఠశాల నిర్వహిస్తున్నారని తెలిపారు. విశాఖలోని ఈ పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి వరకే ఉందని, రానున్న విద్యా సంవత్సరం నుంచి వారిజ ప్రాంగణంలోనే ఇంటర్, డిగ్రీ కోర్సులను కూడా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటర్ల ద్వారా నేత్ర విద్యాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారన్నారు. వారిజ కమిటీ సభ్యులు, ఎంఎస్ రాజు, సాతులూరి రామానుజం, టి. నారాయణరెడ్డి, కాశి రాజు, బుస్కీ మాస్టర్, పీఎస్ఎన్ రాజు, వారిజ వేద పాఠశాల ఆచార్యులు సంతోష్ కుమార్, నేత్ర విద్యాలయ ఇన్‌చార్జి శిరీష తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 10.44 లక్షలు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో హుండీలు లెక్కించారు. 32 రోజులకు గాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.10,44,345 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. కరకచెట్టు అమ్మవారి దేవస్థానం ఈవో కె.గాయిత్రి పర్యవేక్షణలో ఆదాయం లెక్కించారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, కమిటీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న శ్రీహరి స్వచ్ఛంద సేవకులు

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

సీతంపేట: గాన గంధర్వుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా ఘంటసాల గాననిధి, ఎంవీఆర్ ఈవెంట్స్ సంయుక్తంగా బుధవారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించాయి. ఈ సందర్భంగా గాయనీ గాయకులు ఘంటసాల పాడిన హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు. నూకల ప్రభాకర్, గంటి ఉష, కె.రాజేంద్రప్రసాద్, శశిరాణి, శ్రీనివాస్, రామ్ నరసింహం, అమ్ము సత్యవతి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, ఉదయ భాస్కరి, పెమ్మరామ్ ప్రభ పాడిన గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముందుగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎం.రూపవాణి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

బెంగళూర్‌లో ఆశ్ర 6వ జాతీయ సదస్సు

డాబాగార్డెన్స్: అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్ర) 6వ జాతీయ సదస్సు ఈ నెల 15న బెంగళూరులో నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు, న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ తెలిపారు. ఈ మేరకు బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ సదస్సు పోస్టర్‌ను బార్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం హబీబ్ సుల్తాన్ అలీ మాట్లాడుతూ ఆశ్ర వినియోగదారుల హక్కులపై అవగాహన, వారి హక్కులకు భంగం వాటిల్లేటప్పుడు వారి తరపున న్యాయ పోరాటం చేస్తూ గత 8 ఏళ్లుగా సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడు బెంగళూరులో నిర్వహించే సంస్థ 6వ జాతీయ సదస్సుకు దేశంలోని 9 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నట్టు తెలిపారు. వీరందరూ వినియోగదారుల హక్కులు కాపాడడానికి కృషి చేస్తున్నారని సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు మాట్లాడుతూ సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. కన్స్యూమర్ ప్రొటెక్ట్ యాక్ట్ ద్వారా ప్రతి ఒక్కరికీ పవర్ ఉందని తెలియాలన్నారు. కార్యక్రమంలో ఆశ్ర రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, కార్యవర్గ సభ్యులు శత్రుఘ్నుడు, నాగరాజు, విశాఖపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరసింగరావు, హబీబ్ సుల్తాన్ అలీ తదితరులు

ఆర్టీసీ ఆదాయానికి గండి

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద ఆర్టీసీ ఆదాయానికి ఆటోలు గండి కొడుతున్నాయి. మార్కెట్ దరి దుర్గాలమ్మ జంక్షన్ వద్ద మూడు బస్టాపులు ఉన్నాయి. అయితే ఇక్కడ ఆర్టీసీకి సంబంధించి అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసుకుని సర్వీసులు చేసుకుంటున్నారు. దీనివల్ల ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. అంతే కాకుండా బస్టాప్ ఎదురుగా ప్రధాన రహదారికి అడ్డంగా ఆటోలను నిలిపి బేరాలు చూసుకోవడంతో ప్రయాణికులు, వివిధ పనుల నిమిత్తం మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు, వన్‌టౌన్ నుంచి వచ్చే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసు చర్యలు తీసుకుని రహదారికి అడ్డంగా ఆటోలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



దుర్గాలమ్మ గుడి వద్ద బస్టాప్‌కు అడ్డంగా ఆటోలు

మాలధారులకు అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న హనుమంతరావు

డాబాగార్డెన్స్: మాలధారణ భక్తులు.. స్వాములకు వివేకానంద సంస్థ చల్మాజీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ అధినేత మట్టపల్లి హనుమంతరావు సహకారంతో బుధవారం అల్పాహారం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వివేకానంద సంస్థ వివిధ మాలలు ధరించిన భక్తులందరికీ అల్పాహారం, భిక్ష అందిస్తుందన్నారు. ఈ మహా నారాయణ సేవలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు. నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, స్వాములు ఎస్. శ్రీనివాసరావు, ధోని, కోదండస్వామి, సూర్యనారాయణరెడ్డి, టి. కృష్ణ, సంస్థ సభ్యులు అప్పలకొండ, సత్తిబాబు, నాయుడు, సూరి చంద్రరావు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.



మందుబాబులు.. ఇదేం తీరు?

కూటమి ప్రభుత్వంలో మందుబాబులు రెచ్చిపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తూ చిందులు తొక్కుతున్నారు. రాష్ట్ర ఖజానాను నింపుకోవడం కోసం చంద్రబాబు ప్రభుత్వం ఇష్టానుసారంగా మద్యం షాపులు, బెల్టు షాపుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. దీంతో నగరంలో ఎక్కడ చూసినా మందుబాబుల హడావుడే కనిపిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే సరస్వతీ పార్కులో కొంత మంది మందుబాబులు మధ్యాహ్నం వేళలో బహిరంగంగా మద్యం సేవిస్తూ ఎంజాయ్ చేశారు. ఇలా ఒక దగ్గరే కాదు.. నగరంలో పార్కులు, ట్రాఫిక్ ఐలాండ్లు, జంక్షన్లు, రహదారుల్లో ఇష్టానుసారంగా మద్యం సేవిస్తు కనిపిస్తున్నారు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

22న పీవోడబ్ల్యు విశాఖ జిల్లా ఏడవ మహాసభలు

సీతమ్మధార: ప్రగతిశీల మహిళా సంఘం ఏడవ జిల్లా మహాసభలను డిసెంబర్ 22న నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. గాజువాక డ్రైవర్స్ కాలనీలోని గౌరవి సత్య నారాయణ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణతో సభ ప్రారంభమవుతుందని తెలిపారు. సభా ప్రాంగణానికి బోయి విజయ భారతి ప్రాంగణంగా నామకరణం చేసామని పేర్కొన్నారు. మహిళా సంఘాల జాతీయ కోఆర్డినేటర్ ఝాన్సీ ప్రారంభోపన్యాసం చేస్తారని, రచయిత్రి విజయ భారతి స్మారకోపన్యాసం చేస్తారన్నారు. ప్రైవేటీకరణతో ఉపాధి అవకాశాలు కోల్పోతున్న మహిళలు అనే అంశంపై గూడూరు సీతామహాలక్ష్మి ప్రసంగిస్తారని తెలిపారు. మహిళా ఉద్యమ కర్తవ్యాలపై పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, కార్యదర్శి పద్మ మాట్లాడతారన్నారు. మధ్యాహ్నం ప్రతినిధుల సభలో కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యక్రమం నిర్దేశించుకుంటామని, నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు.



మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రతినిధులు

ఆక్వా టెక్నీషియన్లకు శిక్షణ

మహారాణిపేట: సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల సంస్థ (ఎంపెడా) విశాఖపట్నం ఆధ్వర్యంలో రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో పని చేసే టెక్నీషియన్లకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం వర్చువల్‌గా ఎంపెడా డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్ ప్రారంభించారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలోని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) కార్యాలయంలో శిక్షణ జరుగుతుందన్నారు. దేశంలోని ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని డైరెక్టర్ తెలిపారు. సుస్థిర ఆక్వా సాగు, నాణ్యమైన రొయ్యల పిల్లల ఉత్పత్తి, నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులపై ఆక్వా టెక్నీషియన్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. హేచరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రవికుమార్, రాజ్‌కమల్ హేచరీస్ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్లు హనుమంతరావు, ఆర్.ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ శంకరరావు, డాక్టర్ కందన్, డాక్టర్ విజయకుమార్, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖజిల్లాలకు చెందిన 30 మంది హేచరీస్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు తదితరులు